ఈ వారం కథ

వెంకట్రావూ!

నాలో బొత్తిగా చైతన్యం అనేదే లేదని, నాలాటి జడపదార్థంతో కాపురం చేయటం ఇంక ఎంతమాత్రం సాధ్యం కాదని ప్రొద్దున్న నువ్వు హఠాత్తుగా ప్రకటించాక ... నమ్మ్మ ... నాకెంత పట్టరాని సంతోషం కలిగిందో నువు ఊహించలేవు. టిఫిన్ తింటున్న మా నాన్న, వడ్డిస్తున్న మా అమ్మ, నీకు కబుర్లు చెప్పి ఎంటర్‌టెయిన్ చేస్తూ నువు మరింత టిఫిన్ తినేందుకు కృషి చేస్తున్న మా అన్న గోడకు కొట్టిన బొమ్మల్లా నిర్ఘాంతపోవటం చూసి చెప్పొద్దూ ... నాకు మరింత నవ్వు ముంచుకొచ్చింది. నా హావభావాలు దాచుకొనేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆపలేని ఆనందం నా మొహాన్ని వెలిగిస్తే నేను ఒక్క నవ్వు నవ్వేస్తే పాపం మా అమ్మ బెంబేలెత్తిపోయింది.

'నా మనసుకి గట్టిదెబ్బ తగిలిందనీ, భరించలేని బెంగతో, దిగులుతో నా మనసు మొద్దుబారిపోయి నేను ఎట్లా వెర్రినవ్వులు నవ్వుతున్నానో నీకు సాక్ష్యాధారాలతో చూపిస్తూ నిన్ను దయతలచమని వేడుకోవటం నాకింకా నవ్వు తెప్పించింది. సినిమాటిక్‌గా నాకు ఎగిరే పక్షులూ, పారే సెలయేళ్ళూ, ఎంత ప్రయత్నించినా కళ్ళముందు కదల్లేదుకానీ, ఆ ఫీలింగ్ వచ్చిందని మాత్రం చెప్పగలను. నిజానికి, రాత్రే తతంగం పూర్తయ్యిందని, నీవు కోరినట్లు సంతకాలు పెట్టేశానని, నీవు రేపే నీ కొత్త భార్యను గృహప్రవేశం చేయిస్తావని వాళ్ళకేం తెలుసు!

ఇంతకుముందే మీ ఫ్రెండ్ అదే ... "లేకి వెధవలా నావైపు కళ్ళప్పగించి చూస్తాడనీ నేను చేసిన దిక్కుమాలిన వంటకాలు వెధవ పొగడ్తలు పొగుడుతూ మెక్కుతాడనీ" తిడతావే ఆ స్నేహితుడు ఫోన్ చేశాడు. "కొత్త సంవత్సరం మన ఇంట్లో ఆయనకు చాలా హేపీగా గడిచిందట. మీ ఇతర స్నేహితులు అదే మాట అన్నారని మీకు చెప్పమన్నాడు. ఎందుకు హేపీగా వుండదూ! పగలంతా నేను గొడ్డులా చాకిరీచేసి అమర్చిపెట్టిన ఫలహారాలు, పలావ్‌లు, బిర్యానీలు, నా డిగ్రీ తెలివితేటలతో చేసిన అరేంజ్‌మెంట్లూ, నీ డ్రింక్ పార్టీకి వేయించిన జీడిపప్పుతో మర్యాదలు ఇవన్నీ కలర్‌ఫుల్లే గదా!

అవ్వాళ నువు పరిచయం చేసిన పరిమళా కలర్‌ఫుల్లే! కాదని నేనెలా అంటానూ. ఆ పిల్లకు పాపం వంటిల్లు సొంతం కాలేదుగా! ఇంట్లో అమ్మో, వదినో అన్నీ అమర్చిపెడితే హాయిగా తయారైపోయి మడత నలగని ఆర్గండీ చీరెతో పెదాల మీద చిరునవ్వుతో 'షి ఈజ్ వెరీ కలర్‌ఫుల్'. పగలంతా ఎడతెగని చాకిరీతో, విశ్రాంతిలేని కళ్ళతో కనీసం స్నానం కూడా చేసే ఓపికలేని నాలో నీకు ఏం చైతన్యం కనబడుతుంది వెంకట్రావూ!

"ఏమిటీ మిసెస్ రావ్! డల్‌గా వున్నావు?" అని పరిమళ పలకరిస్తే,

"తనంతే టచ్‌మీ నాట్. ఆవిడకు మనుషులు పడరు, మనలోకం మనిషి కాదు" అని నీవు చీప్ జోక్స్ పేలిస్తే నాకూ నవ్వొచ్చింది. నీ సొంత సుఖం, స్వార్థం తప్ప రెండో విషయం గురించి ఆలోచించని, మరి నీదేలోకం వెంకట్రావూ? అసలు నాలోకం గురించి నీకేం తెలుసనీ, ఏకోశానా నాలో ఉత్సాహం కనిపించదనీ, ప్రేమ, ఆనందం వంటి సాధారణ లక్షణాలు నాలో లేవని, నీవెంతో నష్టపోయావని నువు పరిమళతో చెప్పటం స్పష్టంగా విన్నాను నేను.

"ఇప్పటికీ మేం అపరిచితులమే పరిమళా" అన్నావు నీవు గొంతులో ఎక్కడలేని ఆర్ద్రత కష్టపడి తెప్పించి; నిజమే, ఇది మాటికి మారుపాళ్ళు నిజం. ఓ పుస్తకం చదవననీ, సాహిత్య చర్చకు రాననీ, కవిత్వానికి నా మనస్సు పరవశం కాదని తపించే నీ హృదయవేదన నిజం. నిజం! మరి నన్ను పరిచయం చేసుకొన్నావా నువ్వు! నీ అలవాట్లు, నీ తిండి రుచులు నీ ఇష్టాల లిస్టులు అన్నీ వరుసబెట్టి చెప్పుకొచ్చావు. నిన్నెంత ప్రేమగా, అపురూపంగా పెంచుకొచ్చారో మీ అమ్మగారు చెప్పగా విన్నా, ఆవిడ నెత్తి మీద నుంచి (కనీసం మీ బాధ్యత అన్నా పాపం తప్పింది) నీ భారం నేను బుజాలమీద వేసుకొన్నా. తిండి, ఇస్త్రీలు, స్నానం, పడకా, అన్నీనూ! నేనే ఇన్నాళ్ల నుంచి నా సొంత పనుల కంటే శ్రద్ధగా నిర్వహించా. ఇన్ని సేవలు నా దగ్గిర నుంచి కట్నంతో సహా పుచ్చుకొన్నప్పుడైనా ఒక్కసారి దయతలచి, నా ఇష్టాలేమిటి అని అడిగావా వెంకట్రావూ!

మీ స్నేహితులతో చర్చలకు నేను 'టీ'లు పెట్టిచ్చాను, మీరంతా తగలేసిన సిగరెట్ల గుట్టలు ఊడ్చిపెట్టాను. మీవంటి మహానుభావుడి కోసం ఎవరైనా వస్తే తలుపుచాటు నుంచి సమాచారం అందించా. నాలుగు కాఫీలు పెట్టమని లోపలికి కేకలు పెట్టావు గానీ, నలుగురూ వచ్చారు, సరదాగా కబుర్లు చెప్పుకుందాం రమ్మని ఎప్పుడైనా పిలిచావా? నేనెలా తెలుస్తాను నీకు! చీకటిని చీల్చుకొనివచ్చే ఉషఃకిరణాలు చూడటం నాకిష్టం. నువ్వు ఎనిమిదయితేకాని లేవవు. లేచేసరికి, గడ్డం గీక్కొనేందుకు వేడినీళ్ళతో సహా టిఫిన్ రెడీ అవ్వాలి. ఇక నాకు ఉషోదయాలెక్కడ, నిద్రమొహంతో గిన్నెలు తోమటం తప్పించి. వెన్నెల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవటం నాకిష్టం. మరి వెన్నెలా, పడకా చూచేక, రెండో కబురు చెపనీయకుండా నామీద పడిపోయి ఐదో నిమిషంలో నిద్రలో రిలాక్స్ అవటం నీకిష్టం. వర్షం వస్తే ఒక్కో చినుకూ చెట్ల మీది నుంచి నిశ్శబ్దంగా జారిపడుతుంటే చినుకు చినుక్కీ భాష్యం చెప్పుకోవటం నాకిష్టం. మరి నీకో వర్షం చినుకు కనిపించగానే, పకోడీలు, బజ్జీలు తింటే బావుంటుందని గుర్తురావటం, అవన్నీ సిద్ధంచేసి, నీకు తినిపించేసరికి నే చూడాలనుకున్న వర్షం కురిసీ వెలసిపోవటం జరిగేది. ఇవన్నీ నీకు చెప్పలేకపోయాను.

నాకు నవ్వటం రాదన్నావు, నిజమే. నిరంతరం నడ్డివిరిగే చాకిరితో నిన్ను చూసి చిరునవ్వు కురిపించే తీరిక ఎక్కడా? కష్టపడి పనిచేసి వస్తే పాపాయి అల్లరి, ఏడుపు నీకు సరిపడేదికాదని, నీవు వచ్చేసరికి దాన్ని నిద్రపుచ్చాలని రూలు పెట్టావు. పగలంతా పాపాయిని నిద్రపోనీయక కూర్చోపెట్టి సరిగ్గా నువ్వు వచ్చే వేళకు దాన్ని నిద్రపుచ్చే పనిలో పగలూ, రాత్రీ నేను సతమతం. అంచేత నీవు తెచ్చిన మల్లెలు అందుకొని ఆనందించే ఓర్పు నాకేదీ! మన పరిచయం అక్కడే ఆగిపోయింది, అయినా నాకు బెంగలేదు. నీకు ఒకందుకు కృతజ్ఞతలు చెప్పాలనిపించింది, నన్నొదిలేశావ్ అంతే చాలు. రెండురోజులు ఏడుపు మొహం పెడితే చాలు. ఆ పైన అంతులేని విశ్రాంతి. పాతికేళ్ళకే అంతా ముగిసిపోయినందుకు ఇంటిల్లిపాదీ నాపై కురిపిస్తున్న జాలి, ప్రేమ, నువ్వు నా పట్ల దయచూపి నన్ను వదిలేసినందుకే దక్కాయి. మేధావి భార్యగా నా అవతారం ఇక చాలిస్తున్నందుకు సంతోషం. ఇంకెవరూ నా పనిలో వంకలెంచరు. నా ఇష్టాలతో నిమిత్తం లేకుండా నీ ఆవేశాలు భరించటం, నీ గొప్పలు వినటం తప్పినందుకు మరింత ఆనందం.

వెంకట్రావు పెళ్ళాం పాత్ర ముగించి, మళ్ళీ నేనెవరో నా ఊనికేమిటో తెలుసుకుని నిలబడేందుకు కాస్త సమయం పడుతుందేమో, అయినా ఫర్వాలేదు. నువ్వు కత్తిరించివేసిన నా రెక్కలు మెల్ల మెల్లగా మొలుచుకొస్తాయి. నీతో సహజీవనం చేసిన దారుణమైన గతంలోంచి బయటపడ్డాక, చేజార్చుకున్న చదువుని గుర్తు తెచ్చుకొంటూనో, అప్పడాలే వత్తుకుంటానో, ఏదైనా కానీ రాబోయేవి బంగారురోజులు. ఆరోజులు నాకిచ్చిన నీకు మరోమారు కృతజ్ఞతలతో ...

ఒకప్పటి నీ పాదదాసి

స్త్రీలు అబలలా?

ఎవరైనా స్త్రీలను అబలలు అని అనుకొంటే పొరపాటే! శారీరకంగాను, మానసికంగాను స్త్రీలు పురుషులు కంటే బలవంతులే. కాకపోతే సామాజిక కట్టుబాట్లు, సంప్రదాయాల పేరిట స్త్రీలను బలహీనులను చేశారు. అయితే నేటి ఆధునిక స్త్రీలు అర్థంలేని కట్టుబాట్లు, సంప్రదాయాలను పక్కనపెట్టి తమ శక్తి ఏమిటో నిరూపిస్తున్నారు.

పురుషులలో కంటే స్త్రీలలో మానసిక పరిపక్వత త్వరగా వస్తుంది. ఈ విషయం బాల్యం నుంచి గుర్తించవచ్చు. బాల్యంలో మగపిల్లలకంటే ఆడపిల్లలకే త్వరగా మాటలు వస్తాయి. ఎలినర్ ఇ. మ్యాక్ బై అనే మానసిక శాస్త్రవేత్త కథనం ప్రకారం పాఠశాలలో పాఠాలను మగపిల్లల కంటే ఆడపిల్లలే త్వరగా చదవగలుగుతారు, రాయగలుగుతారు. అయితే అయిదు లేక ఆరవ తరగతికి వచ్చే సరికి మగపిల్లలు కూడ బాగానే చదవగలుగుతారు. ఆడపిల్లలు ఆ స్థాయికి వచ్చేసరికి చక్కటి ఉచ్చారణ కలిగి వుంటారు. లెక్కలకు సంబంధించిన ప్రాబ్లమ్స్ సులభంగా అర్థం చేసుకోగలుగుతారు.

సామాజిక ప్రవర్తన, నియమ నిబంధనల విషయానికి వస్తే ఆడపిల్లలు, మగపిల్లలు ఏడేళ్ళ వయస్సు వరకు ఒకే విధంగా వ్యవహరిస్తారు. శారీరకంగా, మానసికంగా మాత్రం మగపిల్లల కంటే ఆడపిల్లలు పెరుగుదల ఎక్కువగా వుంటుంది. ఏడాది వయస్సు నుంచి 13 ఏళ్ళ వరకు ఆడపిల్లల పెరుగుదలలోని తేడా సులభంగా గుర్తించవచ్చు. అయితే 18 నుంచి 20 ఏళ్ళ వయసు వచ్చే సరికి ఇరువురిలో పెరుగుదల సమానం అవుతుంది.

ఆరోగ్యం విషయానికి వస్తే మగవారికంటే స్త్రీ శారీరకంగా, మానసికంగా బలంగా వుంటుంది. స్త్రీలలో వుండే కొవ్వు వారికి ప్రత్యేక రక్షణ కలిగిస్తుంది. స్త్రీలలో వ్యాధి నిరోధక శక్తి కూడ ఎక్కువే. కాకపోతే కొంతమంది అనవసరమైన మానసిక వత్తిడులతో తమకు ఆరోగ్యం సరిగా వుండదు అనే మానసిక న్యూనత భావానికి గురవుతుంటారు. 'మధుమేహం' మినహా ప్రాణాంతక వ్యాధులు స్త్రీలకు రావటం తక్కువ. మూత్ర పిండాలకు సంబంధించిన వ్యాధులు క్షయ, గుండె జబ్బుల కారణంగా చనిపోయే వారిలో దాదాపు 80 శాతం మంది పురుషులు కావడమే అందుకు ఉదాహరణ. కొంత మంది స్త్రీలకు హైపర్‌టెన్షన్ (రక్తపోటు) వున్నప్పటికీ వారు తట్టుకో గలుగుతారు. ఆపరేషన్లు చేయించుకోవలసి వచ్చినప్పుడు మగవారికంటే స్త్రీలే ఎక్కువ ధైర్యంగా వుంటారు.

> మధుమేహం మినహా ప్రాణాంతక వ్యాధులు స్త్రీలకు రావడం తక్కువ. మూత్ర పిండాలకు సంబంధించిన వ్యాధులు, క్షయ, గుండె జబ్బుల కారణంగా చనిపోయే వారిలో దాదాపు ఎనభై శాతం మంది పురుషులే.

మానసికమైన జీవిత సమస్యలు వచ్చినప్పుడు పురుషులు కంటే స్త్రీలే ధైర్యంగా వుంటారు. సమస్యలను పురుషులు బయటకు స్వేచ్ఛగా చెప్పకుండా తమలో తామే బాధపడుతుంటారు. కాని స్త్రీలు ఏ సమస్యనైనా తేలికగా తీసుకోవడంతో ఆ సమస్యను తేలికగా బయట పెట్టకలుగుతారు.

దాంతో వారు సమస్యను సులభంగా పరిష్కరించుకోగలుగుతారు. అయితే మగవారిలో మెదడు మాత్రం స్త్రీలకంటే కొంచెం ఎక్కువ పరిమాణంలో వుంటుంది. ఈ వ్యత్యాసంవల్ల స్త్రీలకు జరిగే నష్టం ఏమి లేదు. 'ఎనటోల్ ఫ్రాన్స్' అనే ఫ్రెంచ్ రచయిత కథనం ప్రకారం మెదడు పరిమాణం ఎక్కువగా వుండటంవల్ల ఎటువంటి అదనపు ప్రయోజనం లేదు. మెదడు పరిమాణం తక్కువగా వుంటేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇప్పుడు మీరే చెప్పండి స్త్రీలు అబలలని అంటారా?

— అన్నవరపు